

ప్రధానమంత్రి మోదీకి శ్రీరంగం ఆలయం వద్ద వేదపండితుల స్వాగతం

తమిళనాట మోదీ తీర్థయాత్ర

● ఒకే రోజు వైష్ణవ, శైవాలయాల సందర్శన

- శ్రీరంగంలో ప్రత్యేక పూజలు
- రామేశ్వరంలో పుణ్యస్నానం
- రెండు క్షేత్రాల్లో రోడ్‌షోలు
- నేడు అరిచ్చలైమునైలో దర్శనం

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ వేడుకలు జరగనున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రంలో శనివారం తీర్థయాత్ర చేపట్టారు. రాష్ట్రంలోని మూడు పుణ్యక్షేత్రాలను సందర్శించాలని సంకల్పించి శనివారం శ్రీరంగం ఆలయ దర్శనంతో తీర్థయాత్రకు శ్రీకారం చుట్టారు. మూడు రోజుల రాష్ట్ర పర్యటన నిమిత్తం విచ్చేసిన ప్రధాని మోదీ శనివారం ఉదయం సుప్రసిద్ధ వైష్ణవాలయం శ్రీరంగం రంగనాథస్వామి ఆలయాన్ని, మధ్యాహ్నం సుప్రసిద్ధ శైవక్షేత్రం రామేశ్వరంలోని పర్వతవర్ధిని సమేత రామనాథస్వామి ఆలయాన్ని దర్శించారు. ఈ రెండు క్షేత్రాల్లోనూ మోదీ రోడ్‌షోలు నిర్వహించారు. రహదారికి ఇరువైపులా నిలిచి ప్రజలు, బీజేపీ కార్యకర్తలు, స్థానిక నాయకులు 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేస్తూ పుష్పవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. ఈ రెండు ఆలయాల్లో మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతామూర్తులను దర్శించుకున్నారు. అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో ప్రథమ దివ్యక్షేత్రంగా, భూలోక వైకుంఠంగా కీర్తి పొందిన శ్రీరంగం రంగనాథస్వామి ఆలయాన్ని ప్రధాని నరేంద్రమోదీ శనివారం ఉదయం సందర్శించారు.

మీనంబాక్కం విమానాశ్రయం నుంచి...

ఖేలో ఇండియా యువజన క్రీడలను ప్రారంభించే నిమిత్తం శుక్రవారం సాయంత్రం చెన్నైకి విచ్చేసిన మోదీ రాత్రి గిండి రాజ్‌భవన్‌లో బస చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, నగర ప్రముఖులను ఆయన కలుసుకున్నారు. అటు పిమ్మట శనివారం ఉదయం రాజ్‌భవన్ నుండి కారులో మీనంబాక్కం విమానాశ్రయం చేరుకుని, విమానంలో తిరుచ్చి చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో శ్రీరంగం ఆలయానికి సమీపంలో ఉన్న పంజకరై హెలిప్యాడ్‌పై దిగారు. అక్కడి నుంచి కారు లో శ్రీరంగం ఆలయానికి బయలుదేరారు. దారి పొడవునా ఆయనకు బీజేపీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆ సందర్భంగా స్థానికులు మోదీ ప్రయాణిస్తున్న కారుపై పూల వర్షం కురిపించారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో రంగనాథ స్వామి ఆలయ దక్షిణ గోపుర ద్వారంలో ప్రవేశించిన మోదీకి ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అదే సమయంలో 40 మంది కళాకారులు నాదస్వరం వాయిద్యంతో స్వాగతమిచ్చారు. ఆలయ అంతర ప్రకారంలోకి వెళ్ళిన మోదీ గరుడాళ్వార్, శ్రీరంగనాథస్వామి, అమ్మవారి సన్నిధులను దర్శించారు. ఆ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను అందజేశారు. అటు పిమ్మట చక్రత్తాళ్వార్, పట్టాభిరామర్, కోదండరామర్, రామానుజర్ సన్నిధులను కూడా దర్శించారు.

రామేశ్వరంలో....

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శైవక్షేత్రం రామేశ్వరం రామనాథస్వామి ఆలయ దర్శనం కోసం శనివారం మధ్యాహ్నం విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీకి అపూర్వ స్వాగతం లభించింది. మధ్యాహ్నం 2 గంటలకు రామేశ్వరంలోని పేయ్‌కరుంబు హెలిప్యాడ్ వద్ద దిగారు. అక్కడి నుండి ఆయన కారులో శ్రీరామకృష్ణ మఠానికి వెళ్లారు. ఆ సమయాన దారిపొడవునా స్థానిక ప్రజలు, బీజేపీ కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. శ్రీరంగం కంటే రామేశ్వరంలో అత్యధిక జనాన్ని చూసిన మోదీ ఉత్సాహంతో కారు ముందువైపు డోర్‌ను తెరచి, ఫుట్‌బోర్డుపై నిలిచి జనం కేసి చేతులూపుకుంటూ వెళ్ళారు. శ్రీరామకృష్ణమఠంలో ఆయన కాసేపు విశ్రాంతి తీసుకున్నారు.



మోదీని ఆశీర్వదిస్తున్న ఆండాళ్ గజం

ఆండాళ్ మౌత్‌ఆర్గాన్ వాద్యానికి ఫిదా...

ఆ తర్వాత ఆలయ ఏనుగు ఆండాళ్ ఆశీస్సులందుకున్నారు. ఆ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆండాళ్ ఏనుగు గురించి చెబుతూ నవరాత్రి ఉత్సవాల్లో ఆ ఏనుగు మౌత్ ఆర్గాన్‌ను చక్కగా వాయిస్తుందని చెప్పగానే మోదీ విస్తుపోయారు. తన కోసం ఆ ఏనుగుతో మౌత్ ఆర్గాన్‌ను వాయించమని అడిగారు. వెంటనే మావటి గజశాలకు పరుగున వెళ్లి మౌత్ ఆర్గాన్‌ను తీసుకొచ్చి ఆండాళ్ ఏనుగుకు ఇచ్చారు. వెంటనే ఆ ఏనుగు మౌత్‌ఆర్గాన్‌ను తొండంతో గట్టిగా పట్టుకుని స్వరాన్ని పలికించింది. ఆండాళ్ మౌత్ ఆర్గాన్‌ను శ్రావ్యంగా వాయించడం చూసి మోదీ ఆశ్చర్యపోయారు. ఆండాళ్ తొండాన్ని ఆప్యాయంగా నిమిరారు. తమిళ రామాయణ గ్రంథ రచయిత కంబర్ ఆ కావ్యాన్ని తొట్టతొలుత ఆవిష్కరించిన కంభరామాయణ మండపానికి వెళ్లారు. అక్కడ సంగీతక వాద్యకళాకారులతోపాటు ఓ తమిళ వాగ్గేయకారుడు సంక్షిప్త కంభ రామాయణాన్ని పారాయణం చేస్తుండగా ప్రధాని మోదీ ఆశీనులై వింటూ తన్మయం చెందారు.

శ్రీరంగాన్ని దర్శించిన తొలి ప్రధాని...

వైష్ణవ దివ్యక్షేత్రమైన శ్రీరంగం రంగనాథస్వామి ఆలయాన్ని దర్శించిన తొట్టతొలి ప్రధానిగా నరేంద్రమోదీ పేరుగడించారు. ఇప్పటివరకూ ఆ ఆలయాన్ని భారత ప్రధానులు సందర్శించిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో తమిళ సంప్రదాయిక దుస్తులైన ధోవతి, చొక్కా కండువా ధరించి శ్రీరంగం ఆలయాన్ని దర్శించారు. ఈ ఆలయానికి కారులో వెళుతున్న మోదీకి అపూర్వ స్వాగతం లభించింది. మోదీ రాకను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం 6గంటల నుంచి శనివారం మధ్యాహ్నం 2.30 గంటల వరకూ భక్తులను దర్శనాన్ని రద్దు చేశారు. శ్రీరంగం పర్యటనను ముగించుకుని మోదీ హెలికాప్టర్‌లో రామేశ్వరానికి బయలుదేరి వెళ్ళారు. హెలిప్యాడ్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆయనకు సాదర వీడ్కోలు పలికారు.

అగ్నితీర్థంలో స్నానం...

విశ్రాంతి అనంతరం ప్రధాని అక్కడి నుంచి రామనాథస్వామివారి ఆలయ దర్శనానికి బయలుదేరారు. మధ్యాహ్నం 3 గంటలకు రామేశ్వరాలయం సమీపంలో అగ్నితీర్థం (అలలు లేని సముద్రతీరం)లో మోదీ పుణ్యస్నానమాచరించారు. బ్యాటరీ కారులో ఆలయ ప్రాకారానికి చేరుకున్నారు. ఆ ఆలయ ప్రాకారంలో ఉన్న 22 తీర్థాలలోనూ ఆయన స్నానమాచరించారు. ఆలయ ప్రవేశద్వారం వద్ద పూర్ణకుంభ మర్యాదలతో ఆలయ ప్రధానార్చకులు, శైవాగమ పండితులు మోదీకి స్వాగతం పలికారు. ఆ సందర్భంగా మోదీ మెడలో రుద్రాక్షమాలలు ధరించి ఆలయం లోపలకు వెళ్లారు. పసుపు శాలువను కప్పుకుని ఆలయంలోని అన్ని సన్నిధులలో కొలువైన దేవతామూర్తులను దర్శించారు. గర్భాలయంలోని పర్వతవర్ధిని సమేత రామనాథుడి సన్నిధి వద్ద ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఆలయంలోని శిల్పకళను ఆసక్తిగా వీక్షించారు.



ఆలయాన్ని సందర్శిస్తున్న ప్రధాని



రామేశ్వరం రామనాథస్వామి ఆలయం వద్ద ప్రజలకు మోదీ అభివాదం



కంబ రామాయణం ఆలకిస్తున్న మోదీ

రామాయణ కథాకాలక్షేపంలో...

ఆ తర్వాత ఆలయ మండపంలో తమిళం, హిందీ, గుజరాతీ, అస్సామీ సహా వివిధ భాషల్లో శ్రీరామకథను తెలిపే కథాకాలక్షేపంలో పాల్గొన్నారు. సంగీత కళాకారులు శ్రావ్యంగా శ్రీరాముడిని కీర్తిస్తూ ఆలపించిన కీర్తనలను విని మోదీ తన్మయం చెందారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత రామేశ్వరం ఆలయ అధికారులతో అరగంట సేపు భేటీ అయ్యారు. అటు పిమ్మట అక్కడి నుంచి బయలుదేరి రాత్రి 7.25 గంటలకు శ్రీరామకృష్ణ మఠానికి వెళ్ళి రాత్రి అక్కడే బసచేశారు.

నేడు అరిచ్చలైమునైలో పూజలు...

ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ఉదయం ధనుష్కోడి సమీపంలోని అరిచ్చలైమునై ప్రాంతాన్ని సందర్శించనున్నారు. అక్కడి కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ముందుగా అరిచ్చల్‌మునై వద్ద శ్రీరాముడు శ్రీలంకకు వంతెన నిర్మించేపనులు ప్రారంభించిన చోట మోదీ ప్రత్యేక పూజలు జరుపనున్నారు. అటు పిమ్మట విభీషణుడు పట్టాభిషేకం జరుపుకున్న ఆలయంగా పేరుగడించిన అక్కడి కోదండరామాలయంలో ఆయన సంకల్పం చేసుకుని పూజలు జరుపనున్నారు. మోదీ పర్యటనను పురస్కరించుకుని తిరుచ్చి, శ్రీరంగం, రామేశ్వరం, ధనుష్కోడి తదితర ప్రాంతాల్లో సుమారు ఐదువేల మంది పోలీసులతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఇక రెండు వైపులా సముద్రతీరం కలిగిన అరిచ్చల్‌మునై ప్రాంతం వద్ద అటు భారత నావికదళం సభ్యులు, ఇటు రాష్ట్ర సముద్రతీర భద్రతా దళం సభ్యులు, కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం పోలీసులు, రాష్ట్ర పోలీసులు కలిసి భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

● రాజ్‌భవన్ ముందు పెట్రోల్ బాంబు దాడి

ఎన్ఐఏ ఛార్జిషీటు దాఖలు

ప్యారీస్, జనవరి 20: స్థానిక గిండిలోని రాజ్‌భవన్ ముందు పెట్రోల్ బాంబ్ విసిరిన కేసులో జాతీయ దర్యాప్తు విభాగం (ఎన్ఐఏ) పూందమల్లి ప్రత్యేక కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేసింది. గత ఏడాది అక్టోబరు 25న రాజ్‌భవన్ ముందు పెట్రోల్ బాంబుతో దాడికి పాల్పడిన తేనాంపేటకు చెందిన రౌడీ కరుక్కా వినోద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై ఐదు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించారు. పలు పోలీస్‌స్టేషన్లలో కరుక్కా వినోద్‌పై కేసులు పెండింగ్‌లో ఉండడంతో అతనిపై గూండా చట్టం ప్రయోగించారు. ఈ వ్యవహారంలో గవర్నర్ ఆర్ఎన్ రవి కూడా కేంద్ర హోంశాఖకు నివేదిక పంపించారు. కాగా, ఈ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కేసును ఎన్ఐఏ విచారణకు స్వీకరించింది. ఇదిలా ఉండగా, పెట్రోల్ బాంబ్ విసిరిన కేసుకు సంబంధించి 680 పేజీల ఛార్జిషీటును దాఖలు చేసింది. ఈ కేసులో రాజ్‌భవన్ ప్రతిపాదన మేరకు ఐపీసీ 124ఐ సెక్షన్‌ను ఎన్ఐఏ చేర్చింది. దీంతో కరుక్కా వినోద్‌పై ఇప్పటికే ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేయగా, ప్రస్తుతం అదనంగా మూడు సెక్షన్ల కింద కేసులు నమోదు కావడం గమనార్హం.



పోలీసులు అదుపులో కరుక్కా వినోద్(ఫైల్‌ఫోటో)

32 మంది తమిళ జాలర్లు నగరానికి రాక

పెరంబూర్, జనవరి 20: శ్రీలంక జైళ్ల నుంచి విడుదలైన 32 మంది రాష్ట్ర జాలర్లు విమానం ద్వారా చెన్నైకి చేరుకున్నారు. వారికి మత్స్యశాఖ అధికారులు స్వాగతం పలికి ప్రభుత్వ వాహనాల్లో సొంతూళ్లకు సాగనంపారు. నాగపట్టినం, మైలాడుదురై, పుదుకోట, కారైక్కాల్ ప్రాంతాల నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన 32 మంది జాలర్లను గత డిసెంబరు 9వ తేది సముద్ర సరిహద్దులు దాటారంటూ శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన విషయం విదితమే. పడవలు, వలలు తదితరాలు కూడా స్వాధీనం చేసుకొని శ్రీలంక హార్బర్‌కు తరలించారు. జాలర్లను విడిపించేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ బాధిత జాలర్ల బంధువులు, జాలర్ల సంఘాలు విజ్ఞప్తి చేశాయి. శ్రీలంకలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు జరిపిన చర్చలు ఫలించడంతో, లంక ప్రభుత్వం 32 మంది జాలర్లను విడుదల చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శ్రీలంక నుంచి ఎయిర్ ఇండియా విమానంలో శుక్రవారం సాయంత్రం మీనంబాక్కం విమానాశ్రయానికి చేరుకున్నారు. వారంతా శనివారం తమ సొంతూళ్లకు చేరుకున్నారు.

ఈసారి 15 సీట్లు అడుగుదాం

● టీఎన్‌సీసీ సభలో నేతల డిమాండ్

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి డీఎంకే కూటమిలో 15 సీట్లు పొందటానికి గట్టి ప్రయత్నం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు శనివారం ఉదయం రాయపేటలోని టీఎన్‌సీసీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో పార్టీ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అజోయ్ కుమార్‌కు తెలిపారు. అంతేకాకుండా ఈసారి కొత్తవారికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ఎంపీలు ఎస్ తిరునావుక్కరసు, విజయ్‌వసంత్, ఎమ్మెల్యేలు సెల్వపెరుంతగై, పళని నాడార్, రాజేష్‌కుమార్, ప్రిన్స్ రామచంద్రన్, జిల్లా శాఖ నేతలు శివ రాజశేఖరన్, రంజన్‌కుమార్, ఎంఏ ముత్తళగన్, ఢిల్లీబాబు పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అజోయ్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శి సిరివెల్ల ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కాంగ్రెస్‌కు తిరువళ్లూరు, కృష్ణగిరి, ఆరణి, కరూరు, తిరుచ్చి, శివగంగ, తేని, విరుదునగర్, కన్నియాకుమారి నియోజకవర్గాలు కేటాయించారు. వీటిలో తేని మినహా తక్కిన ఎనిమిది చోట్లా కాంగ్రెస్ గెలుపొందింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరుగుతుండటంతో ఈ సారి 12 నుంచి 15 లోక్‌సభ స్థానాలల్లో పోటీ చేయాలని సీనియర్ నేతలు పేర్కొన్నారు. అదే సమయంలో యాభై శాతం సీట్లను కొత్తవారికి కేటాయించాలని సూచించారు. అంతే కాకుండా కాంగ్రెస్ గెలుపొందటానికి అవకాశమున్న తిరునల్వేలి, తెన్‌కాశి తదితర నియోజకవర్గాల జాబితాను సిద్ధం చేసి అధిష్ఠానానికి పంపాలని కూడా పార్టీ నేతలు ప్రతిపాదించారు. ఇక వీలైనంత త్వరగా సీట్ల సర్దుబాట్లపై డీఎంకేతో చర్చలు జరపాలని కూడా పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీట్ల కేటాయింపులపై చర్చలు జరిపేందుకు టీఎన్‌సీసీ నేత కేఎస్ అళగిరి నాయకత్వంలో 33 మంది సభ్యుల కమిటీని ఇటీవలే ఏర్పాటు చేశారు. ఆ కమిటీ త్వరగా సీట్ల సర్దుబాట్లు చేసుకోవాలని పార్టీ సీనియర్ నేతలు కోరారు.

ఎల్ఈడీ వాహనం... : ఈ సమావేశం ముగిసిన తర్వాత గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కాంగ్రెస్ సభాపక్ష నాయకుడు ఎంఎస్ ద్రవియం సిద్ధం చేసిన రాహుల్ పాదయాత్రను ప్రత్యక్షప్రసారం చేసే ఎల్ఈడీ స్క్రీన్ వాహనాన్ని టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు గోపన్నా, పొన్ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శులు చిరంజీవి, దళపతి, భాస్కర్, సాహిత్య విభాగం అధ్యక్షుడు పిఎస్.బుద్ధన్, జాలర్ల విభాగం అధ్యక్షుడు జోర్‌ధాన్, కళల విభాగం అధ్యక్షుడు చంద్రశేఖర్, రంజన్‌కుమార్, చూళై రాజేంద్రన్, టీఎల్‌వీ ధనలక్ష్మి, పి. రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సత్యమూర్తి భవన్ వద్ద రాహుల్ పాదయాత్ర ప్రచార ఎల్ఈడీ సంచార వాహన ప్రారంభోత్సవంలో అజోయ్‌కుమార్, అళగిరి తదితరులు

నేడు డీఎంకే యువజన మహానాడు

జ్యోతిని స్వీకరించిన స్టాలిన్ ● డ్రోన్లతో ప్రత్యేక ప్రదర్శన ● భారీగా తరలివచ్చిన యువజనం

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హక్కుల సాధన కోసం ఆదివారం డీఎంకే యువజన ద్వితీయ మహానాడును నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో సేలంలో శనివారం సాయంత్రం అక్కడి వేదిక వద్ద ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో మహానాడు జ్యోతిని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వీకరించారు. ఈ మహానాడుకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 5 లక్షలమంది హాజరుకానున్నారని డీఎంకే యువజన విభాగం నేత, మంత్రి ఉదయనిధి ప్రకటించారు. ఈ మహానాడు కోసం ఈనెల 18న జ్యోతి యాత్రను ప్రారంభించారు. ఆ జ్యోతియాత్ర పలు నగరాల మీదుగా శనివారం సాయంత్రం మహానాడు ప్రాంతమైన సేలంకు చేరింది. ఆ జ్యోతిని డీఎంకే యువజన విభాగం డిప్యూటీ కార్యదర్శి జోయల్ తదితరులు ఉదయనిధికి అందజేశారు. ఆ తర్వాత సాయంత్రం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఆ జ్యోతిని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌కు మంత్రి ఉదయనిధి అందజేశారు. చివరగా మహానాడు వేదిక ప్రాంతం వద్ద డ్రోన్ కెమెరాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఆ డ్రోన్ల ద్వారా ఆకాశంలో పెరియార్, అన్నాదురై, కరుణానిధి, ఉదయసూర్యుడు, స్టాలిన్, ఉదయనిధి రూపాలు ప్రత్యక్షమయ్యాయి. ఆ ఆకారాలను మహానాడు నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నిర్వాహకులు ఆసక్తిగా తిలకించారు.



యువకుల మోటరుసైకిళ్ల ర్యాలీ



జ్యోతిని స్వీకరిస్తున్న సీఎం

సమాచార దృశ్ని

పీజీ వైద్యులకు ప్రోత్సాహక భత్యం

ఐసిఎఫ్, జనవరి 20: ప్రభుత్వ పీజీ వైద్యులకు ప్రతి నెలా రూ.9,000 ప్రోత్సాహక భత్యం అందజేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పీజీ వైద్యులకు ఒకే రకమైన ప్రోత్సాహక భత్యం అందజేయాలని వైద్యుల సంఘ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ప్రతినిధులతో ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం శుక్రవారం చర్చలు జరిపారు. వైద్యులందరికీ ప్రభుత్వ జీవో ప్రకారం రూ.9,000 ప్రోత్సాహక భత్యం అందిస్తామని ప్రకటించారు.

విరుపాచ్చిమేడులో అన్నదాన శాల

ఐసిఎఫ్, జనవరి 20: దిండుగల్ జిల్లా విరుపాచ్చిమేడులో అన్నదానశాల ఏర్పాటు చేస్తున్నట్లు పళని మురుగన్ ఆలయ అధికారులు తెలిపారు. యేటా తైపూసం రోజున వ్రతం ఆచరించి పళనికి పాదయాత్రగా వచ్చే భక్తుల సంఖ్య లక్షల్లో ఉంటుంది. వారికి ఆదివారం దిండుగల్, సోమ, మంగళవారాల్లో తిరుపాచ్చిమేడులో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నదానం చేసేందుకు పళని ఆలయ అధికారులు అన్నదాన శాలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు వైద్యశిబిరం కూడా నిర్వహించనున్నారు.

త్రిశూలం క్వారీ నుంచి తాగునీరు

ఐసిఎఫ్, జనవరి 20: స్థానిక పల్లావరం మండలం త్రిశూలంలో ఉన్న క్వారీ నుంచి త్వరలో తాగునీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య పరిష్కరించేలా ఈ క్వారీలోని నీరు శుద్ధీకరించి సరఫరా చేసేందుకు జలవనరుల శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం నీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను రూ.12.50 కోట్లతో ఏర్పాటు చేశారు. త్వరలో ఈ క్వారీ నుంచి పల్లావరం, పమ్మల్, అనకాపుత్తూర్, చిట్లపాక్కం, తిరునీర్‌మలై ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పల్లావరం ఫ్లైఓవర్‌పై రాకపోకలు ప్రారంభం

ఐసిఎఫ్, జనవరి 20: స్థానిక పల్లావరం ఫ్లై ఓవర్‌పై వాహన రాకపోకలు ప్రారంభమయ్యాయి. జీఎస్‌టీ - కుండ్రత్తూర్ రహదారుల జంక్షన్ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేందుకు వన్‌వే ఫ్లై ఓవర్ నిర్మించారు. శుక్రవారం నుంచి ఈ ఫ్లై ఓవర్‌పై వాహన రాకపోకలు ప్రారంభమయ్యాయి.

28న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

ఐసిఎఫ్, జనవరి 20: స్థానిక అంబత్తూర్‌లో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ఈనెల 28వ తేది జరుగనున్నాయి. సేతుభాస్కర పాఠశాలలో జరగనున్న ఈ పోటీల్లో చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలకు చెందిన 8, 11, 14, 17 ఏళ్ల క్రీడాకారులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 26వ తేదిలోపు నెం.7339348675లో సంప్రదించవచ్చు.

రేపటినుంచి టెన్నిస్ పోటీలు

ఐసిఎఫ్, జనవరి 20: రామచంద్ర ఆదిత్యానార్ స్మారక అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు సోమవారం నుంచి 28వ తేది వరకు జరగనున్నాయి. రాష్ట్ర టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో అడయార్ గాంధీ నగర్ క్లబ్ మైదానంలో జరిగే పోటీల్లో గెలుపొందే వారికి రూ.21లక్షల విలువైన నగదు బహుమతులు అందజేయనున్నారు. 15 దేశాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

కిలో మల్లెలు రూ.4,000

ఐసిఎఫ్, జనవరి 20: ముహూర్త దినాలు కావడంతో కోయంబేడు మార్కెట్లో కిలో మల్లెపూలు రూ.4,000 విక్రయమవుతున్నాయి. వివిధ జిల్లాలు, శివారు ప్రాంతాల నుంచి మార్కెట్‌కు పూలు దిగుమతి అవుతున్నాయి. మార్గళి మాసంలో శుభముహూర్తాలు లేకపోవడంతో పాటు వర్షాలకారణంగా పూల విక్రయాలు తగ్గాయి. ఈ నేపథ్యంలో,ఆదివారం తైమాసం మొదటిశుక్లపక్షం ముహూర్తం రోజుకావడంతో వివాహాలు, విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. వీటిని పురస్కరించుకొని పూల ధరలు పెరిగాయి. కిలో మల్లెపూలు రూ.4,000, ముల్లై రూ.1,800, జాజి మల్లెలు రూ.1,300, సంపంగి రూ.300, గన్నేరు రూ.150, బటన్ రోజ్ రూ.200, పన్నీర్‌రోజ్ రూ.150 సహా అన్ని రకాల పూల ధరలు పెరిగాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బంధువులకు నిషేధం

ఐసిఎఫ్, జనవరి 20: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పత్రాల రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారి బంధువులను అధికారులు నిషేధించారు. ఈ కార్యాలయాల్లో నగదు మార్పిడి నిషేధించినప్పటికీ, అవినీతి ఫిర్యాదులొస్తున్నాయి. బంధువులు, స్నేహితుల పేరుతో ఏజెంట్లు హడావుడి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు, రిజిస్ట్రేషన్ల సమయాల్లో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులను అనుమతించరాదని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రేపటి నుంచి జాక్టో జియో ఆందోళనలు

ప్యారీస్, జనవరి 20: పాత పింఛన్ విధానం అమలు సహా 10 డిమాండ్ల సాధనకు జాక్టో జియో సంఘాల ఆధ్వర్యంలో దశల వారీ ఆందోళనలు చేపట్టనున్నారు. ఈ ఆందోళనల్లో భాగంగా తమ కోర్కెలు ప్రజలకు తెలియజేసేలా ఈనెల 22నుంచి 24వ తేది వరకు ప్రచారం, 30వ తేది జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టనున్నారు. అప్పటికీ కూడా ప్రభుత్వ స్పందించని పక్షంలో ఫిబ్రవరి 5 నుంచి 9వ తేది వరకు అన్ని పార్టీల నేతలను సంప్రదించి మద్దతు కోరనున్నారు. 10వ తేది జిల్లాస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టనున్నారు. అలాగే, 15వ తేది నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడతామని ఆ సంఘాల నేతలు తెలిపారు.

29 నుంచి సివిల్ జడ్జి పోస్టుల ఇంటర్వ్యూలు

ప్యారీస్, జనవరి 20: తమిళనాడు న్యాయశాఖలో ఖాళీగా ఉన్న సివిల్ జడ్జి పోస్టులకు ఈనెల 29వ తేది నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ప్రకటించింది. 245 పోస్టుల భర్తీకి మెయిన్ పరీక్షలు గత ఏడాది నవంబరు 4,5 తేదీల్లో నిర్వహించగా, గత నెల 5వ తేది ఫలితాలు విడుదల చేశారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా 472 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. కాగా, అభ్యర్థులకు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 10వ తేది వరకు స్థానిక బ్రాడ్‌వే సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. మరిన్ని వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని అధికారులు తెలిపారు.

నేటితో ముగియనున్న పుస్తక ప్రదర్శన

ప్యారీస్, జనవరి 20: స్థానిక నందనం వైఎంసీఏ మైదానంలో ఈనెల 3వ తేది నుంచి దక్షిణ భారత ముద్రణ, విక్రయదారుల సంఘం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ఆదివారంతో ముగియనుంది. ముగింపు వేడుకల్లో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆర్.మహాదేవన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 47వ పుస్తక ప్రదర్శనను మంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో సుమారు 900లకు పైగా స్టాళ్లు ఏర్పాటయ్యాయి. భారీవర్షాల కారణంగా ఈ నెల 8వ తేది సోమవారం రోజున ప్రదర్శనకు సెలవు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, సంఘ అధ్యక్షుడు సేతు చొక్కలింగం అధ్యక్షతన ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరగనున్న ముగింపు సభలో పలువురు సాహితీవేత్తలు, పాఠకులు పాల్గొంటారని కార్యదర్శి ఎస్కే మురుగన్ తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా మోదీ పర్యటన

● నిరాశకు గురైన ఓపీఎస్, అన్నామలై

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా పోటీలను ప్రారంభించేందుకు చెన్నైకి విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయాలకు దూరంగా, ఆధ్యాత్మికతకు చేరువగా తన పర్యటనను కొనసాగించారు. దీంతో మోదీ వద్ద రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చలు జరపాలని తహతహలాడిన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకి తీవ్ర నిరాశే మిగిలింది. రాజకీయ చర్చలు... శాలువలు, బొకేలతో సత్కారాలు వద్దు అంటూ ముందుగానే మోదీ ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికీ వర్తింపజేశారు. శుక్రవారం సాయంత్రం విమానాశ్రయం వద్ద కూడా మోదీ నిరాడంబరంగా వ్యవహరించారు. మోదీని రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి దురైమురుగన్, ఎంపీలు దయానిధి మారన్, కనిమొళి స్వాగతించారు. మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్, ఆయన మద్దతుదారుడు వైద్యలింగం కూడా మోదీకి స్వాగతం పలికారు. ఆ సమయంలో ఓపీఎస్‌తో నిమిషం పాటు మోదీ ఏదో విషయమై మాట్లాడారు. ఆ తర్వాత ఎవరి వద్దా శాలువలు, పుష్పగుచ్ఛాలు స్వీకరించకుండా హెలికాప్టర్‌లో అడయార్ ఐఎన్‌ఎస్ హెలిప్యాడ్‌కు బయలుదేరారు. అక్కడ మోదీకి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై స్వాగతం పలికారు. అక్కడి నుంచి మోదీ కారులో నెహ్రూ స్టేడియంకు బయలుదేరుతుండగా ఆ కారులో తనను ఎక్కించుకుని వెళ్తారని అన్నామలై ఎదురు చూశారు. అయితే మోదీ ఒంటరిగా వెళ్లారు. అన్నామలై మరో కారులో స్టేడియానికి చేరుకోవాల్సి వచ్చింది.



రాజ్‌భవన్‌లో మొక్క నాటుతున్న ప్రధానమంత్రి, పక్కన రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు

పీఎంవో ఆంక్షలు...

ప్రధాని కార్యాలయం బీజేపీ రాష్ట్ర శాఖకు కూడా ఆంక్షలు విధించినట్లు వెల్లడైంది. ఆ మేరకు మూడు రోజులపాటు మోదీ పర్యటించనున్న కీలకమైన ప్రాంతాల వద్ద పది మంది బీజేపీ ప్రముఖులు స్వాగతం పలికితే చాలునని పీఎంఓ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఖేలో ఇండియా ప్రారంభోత్సవాలు ముగించుకుని వెళుతున్న మోదీని నటి ఖుష్బూ, సినీ నటుడు అర్జున్ మాత్రమే మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆ తర్వాత రాజ్‌భవన్‌కు బయలుదేరిన మోదీ కారును అన్నామలై, కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ మరో కారులో వెంబడించారు. రాజ్‌భవన్ ప్రవేశద్వారం వరకు అనుమతించిన భద్రతా విభాగం అధికారులు రాజకీయ భేటీలు ఉండకూడదంటూ ఆంక్షలు విధించారని తెలిపి తిప్పి పంపారు. అదే సమయంలో శుక్రవారం రాత్రి రాజ్‌భవన్‌లో బస చేసిన మోదీ గవర్నర్ రవిని కలుసుకునేందుకు కూడా అంగీకరించలేదు. అయితే శనివారం ఉదయం గవర్నర్ దంపతులు మోదీకి ఘనంగా వీడ్కోలు పలికారు. రాజ్‌భవన్ ప్రాంగణంలో మోదీ ఓ మొక్కను నాటి నీరు పోశారు. ఆ తర్వాత మోదీ రాజ్‌భవన్ నుంచి కారులో బయలుదేరి విమానంలో తిరుచ్చికి బయలుదేరి వెళ్లారు.

రాజకీయాలకు అతీతంగా...

ఇలా మోదీ నగర పర్యటన పూర్తిగా రాజకీయ భేటీలకు అతీతంగా సాగింది. ఇదే విధంగా శ్రీరంగం ఆలయం, రామేశ్వరం ఆలయ దర్శనంలోనూ ప్రధాని మోదీ ఆధ్యాత్మికతకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రెండు చోట్లా ఆయన రోడ్ షోలు నిర్వహించారు. ఎక్కడా బీజేపీ కార్యకర్తలు పార్టీపరమైన నినాదాలు చేయలేదు. అదే సమయంలో 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేయడంతో మోదీ కారు డోర్ తెరచి ఫుట్‌బోర్డ్‌పై నిలిచి జనం కేసి చేతులూపుకుంటూ కార్యకర్తల పూల వర్షంలో తడుస్తూ వెళ్లారు. దీనితో ప్రధాని భద్రతా విభాగం అధికారులు కారు డోర్ తెరచి నిలిచిన మోదీ చుట్టూ రక్షణగా నిలవడానికి తంటాలు పడ్డారు.

నేను బీజేపీలో చేరలేదు

● నటుడు అర్జున్

పెరంబూర్, జనవరి 20: ప్రధానిని కలుసుకోవడంలో రాజకీయం లేదని, తాను బీజేపీలో చేరలేదని నటుడు అర్జున్ స్పష్టం చేశారు. చెన్నైలో నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' పోటీలను శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. చెన్నైకి వచ్చిన ప్రధానమంత్రిని నటుడు అర్జున్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దీంతో, ఆయన బీజేపీలో చేరుతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. ప్రధానితో భేటీపై నటుడు అర్జున్ స్పందిస్తూ... తాను బీజేపీలో చేరుతున్నట్లు పలు కథనాలు వస్తున్నాయని, ఆ వార్తల్లో నిజం లేదన్నారు. ప్రధాని మోదీ అంటే తమ కుటుంబానికి ఎంతో ఇష్టమని, తాను నిర్మించిన ఆలయానికి రావాలని ప్రధానిని ఆహ్వానించానని తెలిపారు. అందుకు అంగీకరించిన ప్రధాని, త్వరలోనే వస్తానని తెలిపారన్నారు. తాను బీజేపీ చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని, తనకు రాజకీయాలపై ఆసక్తి లేదని అర్జున్ తెలిపారు.

ప్రధానికి వ్యతిరేకంగా ఆందోళన

రైతుల అరెస్ట్



అయ్యాకన్ను సహా రైతులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పెరంబూర్, జనవరి 20: తిరుచ్చిలో స్వామి దర్శనానికి వచ్చిన ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నల్లజెండాల ప్రదర్శన, రాస్తారోకోకు యత్నించిన సుమారు 100 మంది రైతులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాని తిరుచ్చి రాక సందర్భంగా, రైతులు పలు సమస్యల డిమాండ్ కోరుతూ నిరాహారదీక్ష చేపట్టేందుకు అనుమతించాలని దక్షిణ భారత నదుల సంధానం రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు అయ్యాకన్ను సమర్పించిన వినతిపత్రాన్ని పోలీసులు తిరస్కరించారు. అయినా, ప్రధానికి నల్లజెండాలతో నిరసన తెలుపుతామని అయ్యాకన్ను ప్రకటించారు. దీంతో, ఆయన్ను శనివారం ఇంటి నుంచి బయటకు రావద్దని పోలీసులు హెచ్చరించారు. అలాగే, గురువారం నుంచి అయ్యాకన్నును గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ నేపథ్యంలో, శనివారం ప్రధాని రాకను పురస్కరించుకొని సుమారు 100 మంది రైతులు అయ్యాకన్ను ఇంటి వద్ద నల్లజెండాలతో గుమిగూడారు. పోలీసులు రైతులను అరెస్ట్ చేసి సమీపంలోని కల్యాణమండపానికి తరలించారు.



చెన్నై పర్యటనలో వున్న ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుస్తకం బహూకరిస్తున్న తమిళనాడు ఒలంపిక్ సంఘ అధ్యక్షుడు, వేల్స్ వర్శిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ ఐసరి కె.గణేష్



చెన్నై టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో శనివారం సాయంత్రం గాత్ర కచేరీ చేసిన 'ఆర్ఆర్ఆర్' చిత్ర ఫేం గాయని ప్రకృతిరెడ్డిని సత్కరిస్తున్న స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు

మద్రాస్ వర్శిటీలో 6 నుంచి 'ధర్మనిధి ఉపన్యాసాలు'

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల 6వ తేదీ నుంచి రెండు రోజుల పాటు 'ధర్మనిధి ఉపన్యాసాలు' జరగనున్నాయి. మెరీనా ఆవరణలోని రజతోత్సవ ప్రాంగణంలో ఉదయం 10.30 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిగా 'ఆర్కాటు ప్రకాశరావు ధర్మనిధి ఉపన్యాసం'లో భాగంగా 'కవికోకిల జాషువా కవితా సంవేదన' అనే అంశంపై తెలుగు ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, 'ఆచార్య గంధం అప్పారావు ధర్మనిధి ఉపన్యాసం'లో భాగంగా 'తమిళ సాహిత్యంలో - మానవతా వాదం: పరిచయం' అనే అంశంపై మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ జొన్నలగడ్డ వెంకటరమణ, 'ములమూడి ఆదిలక్ష్మి ధర్మనిధి ఉపన్యాసం'లో భాగంగా 'పోతన భాగవతం - భక్తి మార్గాలు' అనే అంశంపై బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు చెందిన ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి, 'ఎన్ఆర్ చందూర్ స్మారక ధర్మనిధి ఉపన్యాసం'లో భాగంగా 'తెలుగు సాహిత్యం - జర్నలిజం: నూతన ధోరణులు' అనే అంశంపై ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆధునిక భారతీయ భాషలు మరియు సాహిత్య అధ్యయన శాఖకు చెందిన డాక్టర్ గంపా వెంకటరామయ్య, 'ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ధర్మనిధి ఉపన్యాసం'లో భాగంగా 'మాడభూషి రచనా వైశిష్ట్యం' అనే అంశంపై సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ ఆరవల్లి జగన్నాథస్వామి, ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి ధర్మనిధి ఉపన్యాసం'లో భాగంగా 'గిరిజన నృత్యాలు - భాష, సాంస్కృతిక వికాసం' అనే అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు చెందిన డాక్టర్ బూసి వెంకటస్వామి ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమాలకు మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు సంచాలకుడిగా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

100 కొత్త బస్సుల ప్రారంభం



కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ప్యారీస్, జనవరి 20: రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థల కోసం నూతనంగా డిజైన్ చేసిన 100 బస్సులను ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం ఉదయం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ బస్సుల్లో దూరప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థల తరపున కొత్తగా 1,666 బస్సులు కొనుగోలుకు రవాణా మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో తొలివిడతగా 100 బీఎస్6 బస్సు సర్వీసులను సీఎం ప్రారంభించారు. గత ఏడాది అక్టోబరు 19వ తేది జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం స్టాలిన్ 110 ఆర్టికల్ కింద రవాణా సంస్థలకు సంబంధించి కొత్త ప్రకటనలు చేశారు. ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుపరచడం, రవాణా సంస్థల ఆర్థిక పరిస్థితి పెంచేందుకు వివిధ పథకాలు రూపొందిస్తున్నామని, రూ.500 కోట్లతో 1,000 కొత్త బస్సులు కొనుగోలు చేయనున్నామని, 1,000 బస్సులకు మరమ్మతులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా 2023-24వ సంవత్సర వార్షిక బడ్జెట్‌లో కొత్త బస్సుల కొనుగోలుకు అవసరమైన నిధులు కూడా కేటాయించారు. ఈ ప్రకటన అమలయ్యేలా విల్లుపురం ప్రభుత్వ రవాణా సంస్థకు 40, కోవై డివిజన్‌కు 40, కుంభకోణం డివిజన్‌కు 10, తిరునల్వేలి, మదురై డివిజన్లకు తలా 5 కొత్త బస్సులు కేటాయించారు. మిగతా బస్సులను రానున్న రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా, మేయర్ ప్రియ, రవాణా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

22న రాష్ట్రంలోనూ సెలవు ప్రకటించాలి

● బీజేపీ

పెరంబూర్, జనవరి 20: రాష్ట్రంలో సోమవారం ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ ప్రభుత్వాన్ని కోరింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో నిర్మించిన రామాలయ కుంభాభిషేకం వేడుకలు ఈనెల 22వ తేది ప్రారంభంకానున్నాయి. కుంభాభిషేకం సందర్భంగా ఈనెల 22న సోమ వారం కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులకు సగం రోజు సెలవును కేంద్రప్రభుత్వం ప్రకటించింది. బీజేపీ పాలిత 10 రాష్ట్రాల్లో కూడా సెలవు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోనూ సోమవారం ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణన్ తిరుపతి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.


రూ.57 లక్షలతో అదనపు తరగతి గదులు

ఐసిఎఫ్, జనవరి 20: స్థానిక మొగప్పేర్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో రూ.57 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను మదురవాయల్ ఎమ్మెల్యే కారంబాక్కం గణపతి ప్రారంభించారు. ఈ పాఠశాలలో తరగతి గదులు తక్కువగా ఉండడంతో ఇటీవల అదనంగా నాలుగు తరగతి గదులు నిర్మించారు. పనులు పూర్తికావడంతో శుక్రవారం గదుల ప్రారంభోత్సవం జరిగింది.

రూ.140 కోట్లకు మద్యం విక్రయాలు

ఐసిఎఫ్, జనవరి 20: సంక్రాంతి సందర్భంగా రూ.140 కోట్లకు మద్యం విక్రయాలు జరిగినట్లు టాస్మాక్ తెలిపింది. పండుగలు, సెలవు దినాల్లో మద్యం విక్రయాలు పెరుగుతుంటాయి. ఈ క్రమంలో, సంక్రాంతిని పురస్కరించుకొని చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం జిల్లాలు కలిగిన చెన్నై మండలంలో ఈనెల 14వ తేది రూ.47.97 లక్షలు, 15వ తేది రూ.54.88 లక్షలు, 17వ తేది రూ.34.8 లక్షలు అని మొత్తం రూ.139.93 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు.

నారాయణి ఆసుపత్రిలో సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న వక్తలు

వేలూరు, జనవరి 20: స్థానిక శ్రీపురం శ్రీ నారాయణి ఆసుపత్రి, రీసెర్చి కేంద్రం ఆధ్వర్యంలో హ్యూమన్ పాపిలోమా వైరస్‌పై సదస్సు జరిగింది. ఈ సదస్సును ఆసుపత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజి ప్రారంభించారు. హ్యూమన్‌పాపిలోమా వైరస్ గుర్తింపు, చికిత్సలు తదితరాలను వైద్యనిపుణులు వివరించారు. ఈ సదస్సులో పలు విభాగాలకు చెందిన వైద్యనిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు బహుమతుల పంపిణీ



కార్మికులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, జనవరి 20: ఆనైకట్టు పంచాయతీ కార్యాలయంలో శనివారం పారిశుధ్య కార్మికులకు బహుమతులు అందజేశారు. మాజీ పంచాయతీ అధ్యక్షుడు సారథి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని, కార్మికులకు చీరలు, పంచెలు, బాగా పనిచేసిన కార్మికులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మణివన్నన్, వార్డు సభ్యులు, కార్యాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

చావు ఇంట మాలలకు బదులు నగదు

● తంజావూరు సమీపంలో వినూత్న ప్రయత్నం

ప్యారీస్, జనవరి 20: రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తికి పూలమాలలతో అంజలి ఘటించేందుకు బదులుగా బాధిత కుటుంబానికి నగదు అందజేసిన ఘటన తంజావూరు జిల్లాలో వెలుగు చూసింది. జిల్లా ఒరత్తనాడు సమీపంలో ఉన్న మేలయూరుకు చెందిన తిరుపతి (35) గత ఏడాది ద్విచక్రవాహనంలో వెళ్తూ ప్రమాదానికి గురై తంజావూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సుమారు ఏడాదిగా చికిత్సలు పొందిన తిరుపతి శుక్రవారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్న బంధువులు, స్నేహితులు మాలలకు బదులుగా నగదును బాధితుడి తల్లిదండ్రులకు అందజేశారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మృతుడి భార్య, మూడేళ్ల కుమారుడిని ఆదుకొనేలా చేసిన ఈ ప్రయత్నంలో సుమారు రూ.35 వేలు వచ్చినట్లు తెలిసింది.

వైభవంగా రత్నగిరి ఆలయ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో వల్లీ, దేవసేన సమేత బాలమురుగన్

వేలూరు, జనవరి 20: స్థానిక రత్నగిరి బాల మురుగన్ ఆలయంలో శనివారం కైకృత్తిక వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా రత్నగిరి బాలమురుగన్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలమురుగన్ సమేత వల్లీ, దేవయానిలకు వివిధ రకాల సుగంధద్రవ్యాలతో అభిషేకం, విశేష అలంకరణ చేసి, మహా దీపారాధన నిర్వహించారు. వ్రతమాచరించిన వేలాదిమంది భక్తులు కావళ్లు మోసుకొచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం



ప్రమాదానికి గురైన వాహనం

పెరంబూర్, జనవరి 20: తూత్తుకుడి నుంచి వేలాంకన్నికి వెళ్తుండగా పట్టుకోట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. తూత్తుకుడి ఇందిరానగర్‌కు చెందిన భాగ్యరాజ్ కుమారుడు మరియసెల్వరాజ్, భార్య పద్మామేరి, కుమారుడు సంతోష్ సెల్వం, అదే ప్రాంతానికి చెందిన షణ్ముగతాయ్, సరస్వతి, గణపతి, చిన్నపాండి (40), రాణి (40), జ్ఞానమ్మాళ్ (60), భాగ్యరాజ్ (61) తదితర 11 మంది వేలాంకన్ని మేరీమాత అమ్మవారి దర్శనానికి శుక్రవారం రాత్రి కారులో బయల్దేరారు. శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో తంజావూరు జిల్లా సేతుపావాసత్రం సమీపం మనేరా ప్రాంతంలో వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న వంతెన డివైడర్‌ను ఢీకొనింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జుకాగా, రాణి, చిన్నపాండి, భాగ్యరాజ్, జ్ఞానమ్మాళ్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. గాయపడిన ఏడుగురిని 108 అంబులెన్స్‌ల ద్వారా తంజావూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పట్టుకోట ప్రభుత్వాస్పత్రికి తరలించిన సేతుపావాసత్రం పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపడంతో పాటు తలా రూ.2 లక్షలు, గాయపడిన వారికి తలా రూ.50 వేలు అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్



వేలూరు, జనవరి 20: పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కాట్పాడి సమీపం పళమతంగిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని భజన ఆలయ వీధిలోని ఇంట్లో తనిఖీలు చేపట్టి 362 బ్రాందీ, 78 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో కోటీశ్వరిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచి వేలూరు జైలుకు తరలించారు.

ఇంటి వెనుక పాతిపెట్టిన బంగారు బిస్కెట్, నగదు స్వాధీనం

ప్యారీస్, జనవరి 20: రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని తైనూరు గ్రామానికి చెందిన మురుగన్ అనే కూలి కార్మికుడి ఇంటి వెనుక భూమిలో పాతిపెట్టిన బంగారు బిస్కెట్, వెండి నగలు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మురుగన్ ఇంటి వెనుక బంగారం, నగదు దాచారనే సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. సమాచారం అందిన ప్రాంతంలో గుంతను తవ్విన పోలీసులు, అక్కడ ఓ సంచిలో రూ.1.10 లక్షల నగదు, 176 గ్రాముల బంగారు బిస్కెట్, జత వెండి పట్టీలు స్వాధీనం చేసుకొని మురుగన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అరక్కోణంలో ఓ కాలువలో పూడికతీత పనుల్లో పాల్గొన్న సమయంలో తనకు దొరికిన సంచిలో ఈ వస్తువులు గుర్తించి, ఎవరికైనా తెలుస్తుందన్న అనుమానంతో ఇంటి వెనుక గుంత తీసి పాతిపెట్టినట్లు మురుగన్ వాంగ్మూలమిచ్చాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

రోడ్డు నిబంధనలు పాటించాలని తల్లిదండ్రులకు చెప్పండి

● నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్



విద్యార్థిని రూపొందించిన మోడల్‌ను పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్

పెరంబూర్, జనవరి 20: రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను సురక్షితంగా నడపాలని తమ తల్లిదండ్రులను కోరాలని గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రోథోడ్ విద్యార్థులను కోరారు. విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నగర పోలీసు శాఖ చేపట్టింది. ఈ ప్రకారం, నగర పోలీసు శాఖ పరిధిలోని 324 పాఠశాలలకు చెందిన 28,000 వేల మంది విద్యార్థులు అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రోడ్డు నిబంధనలపై 67 పాఠశాలలకు చెందిన 248 మంది విద్యార్థులు తాము రూపొందించిన అవగాహన కార్యక్రమాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను శనివారం సెయింట్ జార్జి ఆంగ్లో ఇండియన్ హయ్యర్ సెకండరీ స్కూలులో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ఉత్తమ మోడల్‌గా ఎంపికైన ఆదంబాక్కంలోని డీఏవీ విద్యార్థులు ప్రథమ బహుమతిగా రూ.50,000, షావుకారుపేటలోని శ్రీ బాదల్‌చంద్ సయార్‌చంద్ చోర్డియా జైన్ విద్యాలయ మెట్రిక్ పాఠశాల విద్యార్థులు రెండో బహుమతిగా రూ.25,000, అశోక్‌నగర్ ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీ స్కూలు విద్యార్థులు మూడో బహుమతిగా రూ.10,000 సొంతం చేసుకున్నారు. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ నగదు బహుమతి అందించారు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల అదుపులో తమిళనాడు ఎర్రచందనం కూలీలు

కలువాయి, జనవరి 20: నెల్లూరు జిల్లా వెంకటరెడ్డిపల్లె కూడలిలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి తమిళనాడు రాష్ట్రానికి చెందిన సుమారు 20మంది ఎర్రచందనం కూలీలను తిరుపతి టాస్క్‌ఫోర్సు అధికారులు అదుపులోని తీసుకున్నట్లు సమాచారం. హైవేపై వేగంగా వెళుతున్న ఓ టెంపో వాహనాన్ని అధికారులు వెంబడించి వెంకటరెడ్డిపల్లె సమీపంలో అడ్డగించారు. అందులో ఉన్న కూలీలు తప్పించుకునే ప్రయత్నం చేయగా గ్రామస్థుల సహకారంతో వారిని పట్టుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రం

● 25న 'తూక్కుదురై' విడుదల

ఎలాంటి హింస లేకుండా, కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రంగా 'తూక్కుదురై' రూపొందించినట్టు దర్శకుడు డెన్నిస్ మంజునాథ్ చెప్పారు. ఓపెన్ గేట్ పిక్చర్స్ బ్యానరుపై నిర్మాతలు అన్బు, వినోద్, అరవింద్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'తూక్కుదురై'. యోగిబాబు, ఇనియ ప్రధాన పాత్రలను పోషించారు. ఈనెల 25న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం శుక్రవారం చెన్నైలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఇందులో చిత్ర దర్శకుడు డెన్నిస్ మంజునాథ్ మాట్లాడుతూ... 'ఈ సినిమాను వచ్చే నెల 9వ తేదీన విడుదల చేయాలని తొలుత భావించాం. కానీ, ఆ రోజున పెద్ద సినిమాలు ఉండటంతో హడావుడిగా ఈనెల 25వ తేదీనే విడుదల చేసేందుకు నిర్ణయించాం. విలేజ్, సిటీ లొకేషన్లలో చిత్రీకరణ పూర్తి చేశాం. హింస లేకుండా, కుటుంబ సమేతంగా ఈ సినిమాను చూస్తూ ఎంజాయ్ చేయొచ్చు. మల్టీస్టారర్‌తో సినిమా తీయడం పెద్ద కష్టమేమీ కాదని నా సిబ్బంది చెప్పారు. సినిమా బాగా వచ్చింది' అని అన్నారు. నిర్మాతల్లో ఒకరైన అరవింద్ మాట్లాడుతూ... 'ఇలాంటి తరుణం కోసం మేము ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూశాం. ఉపాధి కోసం అమెరికాకు వెళ్లడంతో స్వదేశీ అనుభూతిని కోల్పోయా. సినీ నిర్మాణ సంస్థను ప్రారంభించడానికి కారణం కూడా ఇదే.


ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్ర బృందం

చిత్రజ్యోతి

దర్శకుడు డెన్నిస్ మంజునాథ్ సినిమాపై అమితమైన ప్రేమ కలిగిన వ్యక్తి. ఎలాంటి ఒత్తిడికి లోను చేయకుండా చిత్ర నిర్మాణం సాఫీగా సాగేలా చేశారు. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని అన్నారు. అలాగే, కెమెరామెన్ రవివర్మ, ఎడిటర్ శ్రీధర్, సంగీత దర్శకుడు మనోజ్ కేఎస్, కొరియోగ్రాఫర్ శ్రీధర్, నటులు రాంకీ అశ్విన్, సెంద్రాయన్, బాల శరవణన్, మహేంద్రన్, సత్య, కూల్ సురేష్, మహేష్ సుబ్రమణియన్, నిర్మాతలు అరవింద్, శ్రీనివాస్, సహ నిర్మాత వినోద్ కుమార్ తదిరులు ప్రసంగించారు.


విజయకాంత్‌కు నాజర్, విశాల్, కార్తి నివాళి

ఎన్నో అవమానాలు దాటి ఉన్నత స్థితికి చేరారు

● కమల హాసన్ ● 'కెప్టెన్'కు కోలీవుడ్ ఘన నివాళి

ఎన్నో అవమానాలు, విమర్శలు ఎదుర్కొని ఉన్నతస్థితికి చేరుకున్న గొప్ప వ్యక్తి కెప్టెన్ విజయకాంత్ అని విశ్వనటుడు కమల హాసన్ అన్నారు. నడిగర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో కెప్టెన్‌కు స్మారక స్మృత్యంజలి జరిగింది. ఇందులో కోలీవుడ్‌కు చెందిన సినీ ప్రముఖులు తరలివచ్చి విజయకాంత్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కమల్ మాట్లాడుతూ... 'విజయకాంత్‌ను నేను తొలిసారి కలిసినప్పుడు ఏ విధంగా ఉన్నారో ఆయన ఒక స్టార్ హీరోగా ఎదిగిన తర్వాత కూడా అలానే మెలిగేవారు. విజయరాజా నుంచి విజయకాంత్‌గా మారినప్పటికీ ఆయన గుణంలో మార్పు లేదు. తాను పడిన అవమానాలు, విమర్శలు వర్ధమాన నటీనటులు పడకూడదన్న దృఢ సంకల్పంతో ఆయన నడుచుకున్నారు. మరో వ్యక్తికి తెలియకుండా ఎన్నో దానధర్మాలు చేసేవారు. ఆయన్నుంచి సాయం పొంది ఉన్నతస్థితికి చేరుకున్న వారికి ఈ విషయం బాగా తెలుసు. విజయకాంత్‌లో నాకు నచ్చింది.. ఆయనలోని న్యాయమైన కోపం. ఆయన ధైర్యం, తెగువ నడిగర్ సంఘానికి పలుమార్లు మేలు చేసింది.


ప్రసంగిస్తున్న కమల హాసన్


విజయకాంత్ కుమారులు

జూనియర్ ఆర్టిస్టుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేవారు. తనకు నచ్చని వారిని కూడా పిలిచి మాట్లాడేవారు. ఆయనలా జీవించేందుకు ప్రయత్నిద్దాం' అని అన్నారు. నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ మాట్లాడుతూ... 'అగ్రనటుడుగా, నడిగర్ సంఘం అధ్యక్షుడిగా ఉన్న కెప్టెన్ ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగారు. ప్రోత్సాహం, ధైర్యం ఇచ్చారు' అన్నారు. సీనియర్ నటుడు శరత్‌కుమార్ మాట్లాడుతూ... 'విజయకాంత్ గొప్ప వ్యక్తి. మంచి మనస్సున్న వ్యక్తి. ఆయన్నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు అనేకం. ఆయన కోపగించుకున్నప్పటికీ అది క్షణికావేశమే. నడిగర్ సంఘాన్ని సంఘటితం చేసి ఒకేతాటిపై ముందుకు తీసుకెళ్లిన నాయకుడు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, విక్రమ్, శివకుమార్, కరుణాస్, పూచ్చి మురుగన్, జయం రవి, సత్యరాజ్, విజయ్ ఆంటోని, విశాల్, కార్తీ, రాధారవి, పొన్‌వణ్ణన్, రాజేష్, చిన్ని జయంత్, ఎస్వీ శేఖర్, రవి మరియా, ఎంఎస్ భాస్కర్, మన్సూర్ అలీఖాన్, పశుపతి, శీమాన్, విఘ్నేష్, జయప్రకాష్, ఆనంద్‌రాజ్, యోగిబాబు, లత, కోవై సరళ, రేఖ, అంబిక, సోనియా, సిమ్రాన్, రిత్విక, రాధా, శరణ్య పొన్‌వణ్ణన్, గాయత్రి రఘురాం, విజయకాంత్ కుమారులు విజయ్ ప్రభాకరన్, షణ్ముగపాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో 'ధృవనక్షత్రం'?

విక్రమ్ హీరోగా ప్రముఖ డైరెక్టర్ గౌతం వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించి స్వయంగా నిర్మించిన 'ధృవనక్షత్రం' సినిమాను వచ్చే నెలలో విడుదల చేసే అవకాశం ఉన్నట్టు నిర్మాణ సంస్థ మద్రాస్ హైకోర్టుకు తెలిపింది. విక్రమ్, అనూ ఇమ్మాన్యుయేల్, పార్తిబన్, రాధిక, సిమ్రాన్, వినాయగన్ తదితరులు నటించిన ఈ చిత్రం ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొన్నేళ్లుగా విడుదలకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో గత యేడాది నవంబరు 24వ తేదీన విడుదల చేయాలని భావించారు. కానీ, ఈ సినిమాకు ఫైనాన్స్ చేసిన ఆల్ ఇన్ పిక్చర్స్ భాగస్వామి మద్రాస్ కోర్టును ఆశ్రయించడంతో విడుదల వాయిదా పడింది. 2018లో తాము ఇచ్చిన రూ.2.40 కోట్లు చెల్లించాలని, ఆ డబ్బులు చెల్లించేంత వరకు సినిమా విడుదల కాకుండా స్టే విధించాలని కోరారు. ఆ తర్వాత ఈ డబ్బులు చెల్లించినప్పటికీ సినిమా మాత్రం ఇంకా విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్‌పై శుక్రవారం మరోమారు విచారణకు రాగా, నిర్మాణ సంస్థ తరఫున హాజరైన న్యాయవాది ఈ సినిమాను వచ్చే నెలలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని, అందువల్ల విచారణను మూడు వారాల వాయిదా వేయాలని కోరారు. దీంతో తదుపరి విచారణను మూడు వారాలకు కోర్టు వాయిదా వేసింది.


విక్రమ్ - అను ఇమ్మాన్యుయేల్

ప్రతిభకు వివాహం అడ్డంకి కాదు

● భావన

ప్రతిభకు వివాహం ఆటంకం కాదని సినీ నటి భావన అంటున్నారు. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషా చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు సుపరిచితమైన భావన... గత 2018లో నవీన్‌ని వివాహం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో వివాహం తర్వాత నటీమణులకు సినీ అవకాశాలు తగ్గిపోతాయన్న అంశంపై ఆమె స్పందించారు. 'నేను 15 యేళ్ల వయసులో నటిగా పరిచయమయ్యాను. వివాహం తర్వాత హీరోయిన్లు నటనకు దూరమవుతారు. దర్శకులు కూడా వారికి అవకాశం ఇవ్వరు. కానీ, నాకు మాత్రం వివాహం తర్వాత సినిమాల్లో నటించాలన్న బలమైన కోరిక. వివాహం ఒకరి ప్రతిభకు అడ్డంకి కాదు. పెళ్లి చేసుకున్న తర్వాత నటించడం ఎందుకు మానెయ్యాలి' అని ఆమె ప్రశ్నించారు.



వీఐటీ వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌కు జీవితసాఫల్య పురస్కారం

వేలూరు, జనవరి 20: స్థానిక వీఐటీ యూనివర్శిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆ వర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్‌కు జీవితసాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. వీఐటీ వర్శిటీలోని డేటా సైన్స్, కొత్త ఆవిష్కరణలపై 8వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభంలో లెక్చరర్ అమోల్ కోజేతేవన సైన్స్ విజ్ఞానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పుస్తకాన్ని వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఐఐఐటీ బెంగళూరు డైరెక్టర్ తేప్‌భరద్వాజ్ పాల్గొని మాట్లాడుతూ... 400 కోట్ల మంది ప్రజలు ప్రపంచస్థాయిలో ఐటీ సేవలను వినియోగించుకుంటున్నారని, భవిష్యత్తులో మరిన్ని కొత్త ఆవిష్కరణలు జరగాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా డేలా సైన్స్ సమాఖ్య (సంస్థ) తరఫున ఉపాధ్యక్షుడు అమలన్ చక్రవర్తి, రాజకీయాలు, విద్య, సమాజసేవలు చేస్తున్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌ను అభినందిస్తూ, ఆయనకు జీవితసాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్, ప్రొ ఛాన్సలర్, రిజిస్ట్రార్, లెక్చరర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవితసాఫల్య పురస్కారం అందుకుంటున్న వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ విశ్వనాథన్



ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో రూ.50 కోట్ల వ్యయంతో శాశ్వత ఎగ్జిబిషన్

● టెండర్లు ఆహ్వానించిన సీఎండీఏ



పెరంబూర్, జనవరి 20: స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో యేటా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తుంటారు. అలాగే, దీపావళి పండుగ సందర్భంగా ఈ మైదానంలో టపాసుల విక్రయాలు చేపడుతుంటారు. తమిళనాడు పర్యాటక అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో హోటల్ కూడా ఈ ప్రాంగణంలో పనిచేస్తోంది. మొత్తం 30 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ మైదానం 19 ఎకరాలు, 12 ఎకరాలు అని రెండు విభాగాలుగా ఉంది. ఈ నేపథ్యంలో, గత 2022-23 బడ్జెట్‌లో, ఐల్యాండ్ గ్రౌండ్‌లో 30 ఎకరాల విస్తీర్ణంలో చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూ.50 కోట్లతో సహజ అడవితో పాటు అర్బన్ పబ్లిక్ స్క్వేర్, ఎగ్జిబిషన్ హాళ్లు, ఓపెన్ ఎయిర్ థియేటర్, రెస్టారెంట్లు తదితరాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అనంతరం గత జూలైలో ఈ ప్రాంతాన్ని పర్యాటక శాఖ మంత్రి రామచంద్రన్, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబులు పరిశీలించారు. ఆ సమయంలో ఉత్తర చెన్నై అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించినట్లు, ఈ నిధులతో ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో ఈ పథకాన్ని చేపట్టనున్నట్లు మంత్రి శేఖర్‌బాబు ప్రకటించారు. ఈ పథక సమగ్ర ప్రణాళిక తయారుచేసి, ముఖ్యమంత్రి అనుమతులు పొంది కాంట్రాక్టర్లను ఎంపిక చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం రూ.50 కోట్లతో శాశ్వత ఎగ్జిబిషన్ ఏర్పాటుకు సీఎండీఏ టెండర్లు ఆహ్వానించింది.



డీఎంకే పాలనలో మహిళలకు భద్రత కరువు

● జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ విమర్శ

పెరంబూర్, జనవరి 20: డీఎంకే పాలనలో మహిళలకు భద్రత కరువైందని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, నటి ఖుష్బూ విమర్శించారు. ప్రధాని మోదీ సూచనలతో స్థానిక మైలాపూర్‌లోని ఆదికేశవ పెరుమాళ్ ఆలయంలో ఖుష్బూ స్వచ్ఛ తీర్థ్ పనులు చేపట్టారు. ఆలయ ప్రాంగణాన్ని చీపురుతో ఊడ్చిన తరువాత ఖుష్బూ విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే ఎమ్మెల్యే ఇంట్లోనే ఓ మహిళ వేధింపులకు గురైందని, ఈ వ్యవహారాన్ని సీఎం ఖండించకపోవడం దారుణమన్నారు. సీఎం మౌనం వారికి మద్దతుగా ఉన్నట్టేనని ప్రజలు భావిస్తున్నారన్నారు. మహిళలకు రక్షణగా ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. జాతీయ మహిళా కమిషన్‌కు తప్పుడు కేసులు, కక్ష్యసాధింపు కేసులు మాత్రమే వస్తున్నాయన్నారు. అలాంటి వాటిని పరిశీలించి నిజమైన కేసులు ఎంపిక చేసి విచారణ చేపడుతున్నామని తెలిపారు. బిహార్, ఆంధ్ర తదితర రాష్ట్రాల నుంచి అధిక కేసులు వస్తున్నాయని ఖుష్బూ తెలిపారు.

మైలాపూర్ ఆదికేశవ పెరుమాళ్ ఆలయ స్వచ్ఛతీర్థ పనుల్లో ఖుష్బూ

మేల్‌మలయనూర్ అంకాళమ్మ సేవలో దుర్గాస్టాలిన్


పూజల్లో సీఎం సతీమణి దుర్గా స్టాలిన్

ప్యారీస్, జనవరి 20: విల్లుపురం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మేల్‌మలయనూరు అంకాళమ్మ ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఇందుకోసం ఆమె శుక్రవారం ఉదయం 11 గంటలకు మేల్‌మలయనూరుకు చేరుకోగా హిందూ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జీవానందం సహా ఆలయ పూజారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణాన్ని సందర్శించిన అనంతరం అమ్మవారు కొలువుదీరిన గర్భగుడి ముందు కూర్చొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 101 మంది మహిళలకు దుర్గా స్టాలిన్ చీరలు పంపిణీ చేశారు. సుమారు గంటసేపు ఆలయంలో గడిపిన ఆమెకు పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

రామాలయ నిధుల సేకరణలో రాష్ట్రానిది మూడో స్థానం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

పెరంబూర్, జనవరి 20: అయోధ్యలో రామాలయం నిర్మాణానికి నిధులు అందజేసిన రాష్ట్రాల్లో తమిళనాడు మూడో స్థానంలో ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. స్థానిక తిరువాన్మియూర్‌లో ఉన్న పాంబన్ స్వామిగళ్ ఆలయంలో శుక్రవారం అన్నామలై స్వచ్ఛ తీర్థ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాని మోదీ ఆదేశాలతో ఈనెల 22వ తేది వరకు బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాలు, మసీదులు అని మొత్తం 500 ప్రార్థనా స్థలాల్లో స్వచ్ఛ తీర్థ్ పనులు చేపట్టనున్నామన్నారు. స్వచ్ఛ నగరాల్లో రాష్ట్రం వెనుకంజలో ఉందన్నారు. గవర్నర్‌పై నిందలు మోపడం డీఎంకే ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. ఎలాంటి అవినీతికి పాల్పడని సేలం పెరియార్ వర్శిటీ ఉపకులపతి జగన్నాథన్ ఇంట్లో దాడులు చేయించి, ఆయన్ను అరెస్ట్ చేశారని ఆరోపించారు. 32 ఏళ్ల డీఎంకే పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారన్నారు.


ఆలయంలో స్వచ్ఛతీర్థ పనుల్లో అన్నామలై

రాష్ట్రం నుంచి అయోధ్యకు 34 ప్రత్యేక రైళ్లు

రాష్ట్రం నుంచి అయోధ్యకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. అయోధ్య రైల్వేస్టేషన్ ప్రతిరోజు 100 రైలు సర్వీసులు నడిపే స్థాయి కలిగి ఉందన్నారు. రాష్ట్రంలోని తిరునల్వేలి, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, మదురై, కన్నియాకుమారి, నాగర్‌కోయిల్ తదితర నగరాల నుంచి 34 ప్రత్యేక రైళ్లను ఐఆర్‌సీటీసీ, తక్కువ ఛార్జీతో నడపనుందని తెలిపింది. ఈ ప్రత్యేక రైళ్ల ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 29వ తేది వరకు నడువనున్నాయని, వివరాలను త్వరలో ప్రకటిస్తామని దక్షిణ రైల్వే పేర్కొంది.



నావికాదళానికి చెందిన శౌర్య నౌకలో విద్యార్థులు - పనితీరును వివరిస్తున్న నావికాదళం సిబ్బంది

నావికాదళంపై విద్యార్థులకు అవగాహన

పెరంబూర్, జనవరి 20: భారత నావికాదళం పనితీరును విద్యార్థులకు వివరించి, వారిలో స్ఫూర్తి నింపడంతో పాటు ఆ దళంలో అధికంగా చేరేలా అవగాహన కల్పిస్తున్నారు. భారత నావికాదళం 48వ రైజింగ్ డే సందర్భంగా విద్యార్థులను నావికాదళం నౌకలు శౌర్య, సుజయ్‌లను సందర్శించే అవకాశం కల్పించారు. ఈ నెల 19, 20 తేదీలతో పాటు 24వ తేది ఈ అవకాశాన్ని కల్పించారు. నగరానికి చెందిన 13 ప్రభుత్వ, 2 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది అని మొత్తం 1,782 మంది స్థానిక హార్బర్‌లో నిలిపిన నౌకలను పరిశీలించారు. నౌక పనితీరు, ఆగంతకులు సముద్రం ద్వారా దేశంలోకి ప్రవేశించడాన్ని అడ్డుకోవడం, సముద్రంలో జాలర్లను రక్షించడం, నావికాదళానికి చెందిన ఆయుధాలు సహా పలు అంశాలపై అధికారులు విద్యార్థులకు వివరించారు.

తిరుపోరూర్ ఆలయంలో నిత్యాన్నదానం

ప్యారీస్, జనవరి 20: స్థానిక తిరుపోరూర్‌లో ప్రసిద్ధి చెందిన కందస్వామి ఆలయంలో శనివారం కైకృత్తిక వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వళ్లీ, దేవసేన సమేత కందస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, హారతి సేవ నిర్వహించారు. ఈ పూజల్లో హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పాల్గొన్నారు. అనంతరం ఈ ఆలయాన్ని సందర్శించే భక్తులకు నిత్య అన్నదానం పథకాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కైకృత్తిక, కైపూసం పర్వదినాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో భక్తులకు అన్ని వసతులు కల్పించామన్నారు. ప్రస్తుతం ఎనిమిది ఆలయాల్లో కొనసాగుతున్న నిత్య అన్నదాన పథకాన్ని వచ్చే బడ్జెట్ సమావేశాల అనంతరం మరో మూడు ఆలయాలకు విస్తరిస్తామన్నారు. రోజూ సుమారు 92 వేలమంది భక్తులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ఏడాదికి రూ.10.5 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.


కందస్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

'జెమ్' ఆసుపత్రిలో మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 'జెమ్' ఆసుపత్రిలో పట్టుకోట్టైకి చెందిన 21 ఏళ్ల యువకుడికి క్లిష్టమైన మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. చిన్నతనం నుంచే పలు ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న ఆ యువకుడికి దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. పొత్తికడుపు నొప్పి, తీవ్రమైన ప్యాంక్రియాటైటిస్, ప్యాంక్రియాటిక్ అబ్‌సెస్, సెపిస్ ఉన్నట్లు కూడా తేల్చారు. అలాగే నరాల సంబంధిత వ్యాధి ఉన్నట్లు కనుగొన్నారు. ఈ నేపథ్యంలో గత నెల 18వ తేదీన మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న ఆ యువకుడు.. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. ఈ వివరాలను శస్త్రచికిత్సకు నేతృత్వం వహించిన డాక్టర్లు సత్యనారాయణన్, యువరాజ్, పి.సెంథిల్‌నాథన్, బాలముకుందన్ తదితరులు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.


విలేకరుల సమావేశంలో వైద్య సిబ్బంది

ఘనంగా ఎస్‌కేపీడీ, కేటీసీటీ స్పోర్ట్స్ మీట్

ప్యారీస్, జనవరి 20: నగరంలోని ఎస్‌కేపీడీ చారిటీస్ నిర్వహణలో కొనసాగుతున్న మహోన్నత, ప్రైమరీ పాఠశాలల వార్షిక స్పోర్ట్స్ మీట్ శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. జార్జిటౌన్‌లోని ఎస్‌కేపీసీ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎస్‌కేపీడీ పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ మునినాథన్ పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాలల కరస్పాండెంట్ ఎస్.ఎల్.సుదర్శనం, ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓరుగంటి లీలారాణి, కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అనిలా, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ.రమేష్, సి.రేవతి, ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్‌బాబు, పి.గౌరిశంకర్, వి.దేవి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



ట్రోఫీ గ్రహీతతో ముఖ్యఅతిథి, నిర్వాహకులు